క్లుప్తంగా

నేడు మండల మీట్

నింద్ర: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ అరుణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

16న వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక

పెనుమూరు(కార్వేటినగరం): మండల ప్రజా పరిషత్ ఉప ఎన్నిక ఈ నెల 16న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నీలకంఠేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనారోగ్యంతో అకాలంగా మృతి చెందిన వైస్ ఎంపీపీ దూది అరుణ స్థానాన్ని భర్తీ చేయడానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీన ఉదయం 11 గంటలకు మండల ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం అధ్యక్షతన ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీటీసీలు పాల్గొని వైస్ ఎంపీపీని ఎన్నుకోవాలని కోరారు.

ఆలయ నిర్వహణపై గ్రామసభ


గ్రామసభలో చర్చలు జరుపుతున్న దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

నగరి : పట్టణ పరిధిలోని ఓరుగుంటాపురం ప్రాంతంలో దేవదాయ శాఖ పరిధిలో ఉన్న గ్రామదేవత ఓరుగుంటాలమ్మ ఆలయ నిర్వహణపై వివాదాలు ఏర్పడిన నేపథ్యంలో జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏకాంబరం బుధవారం ఆలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామస్తులతో చర్చించారు. అందరి అభిప్రాయాలను సేకరించినవారు ఏకాభిప్రాయానికి రావడానికి వీలు పడకపోవడంతో మరో మారు ఈ అంశంపై సుదీర్ఘ చర్చలు జరిపి అభిప్రాయాలను వెల్లడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మాంబేడులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు గ్రామ సచివాలయ పరిధిలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీడీఓకు ఘన సన్మానం


ఎంపీడీఓను సన్మానిస్తున్న నాయకులు

వెదురుకుప్పం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీఓకు దుశ్శాలువ కప్పి సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, నాయకులు బాలకృష్ణారెడ్డి, పురంధర్‌రెడ్డి, వెంకటేష్ ఉన్నారు.

నిబంధనలు పాటించండి


టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని నీవానది సమీపంలో టపాకాయల విక్రయానికి అనుమతి ఇచ్చిన ప్రదేశాన్ని తహసీల్దార్ ఇన్బనాథన్, ఎస్ఐ రామాంజనేయులు బుధవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల విక్రయాలకు నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. టపాకాయల విక్రయ ప్రాంతంలో ప్రమాద సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్, పారా అట్లాంటిక్ చాంపియన్ భాగ్యశ్రీ జాదవ్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కార్వేటినగరం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న అర్జీదారులు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు


ప్రతి సమస్యకు పరిష్కారం చూపండి

- ప్రతిష్టాత్మకంగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహణ
- స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- 15 రోజుల్లోపు పరిష్కార మార్గాలు చూపండి
- జేసీ శ్రీనివాసులు

కార్వేటినగరం: ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో కలసి ఎంపీపీ లత, సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాల పరిధిలో పరిష్కారం కాని సమస్యలను మండలస్థాయి అధికారులు పరిష్కరించాలని కోరారు. మరింత జటిలమైన సమస్యలైతే జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసే స్పందన కార్యక్రమానికి తీసుకురావాలన్నారు. గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం బుధ, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు జిల్లాలో ఏదో ఒక మండలంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. చిన్నపాటి సమస్యలను కూడా వ్యయప్రయాసలకు ఓర్చి జిల్లా కేంద్రాలకు రావడం మానుకోవాలని సూచించారు. పరిష్కారం కాని భూతగాదాలు ఉన్న వారు కోర్టులను ఆశ్రయించాలన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు..

గ్రామీణ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జేసీ శ్రీనివాసులు అధికారులను హెచ్చరించారు. మండల స్థాయిలో నిర్వహించే కార్యక్రమం ద్వారా జిల్లా అధికారులు పాల్గొనడంతో సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే ఆస్కారం ఉంటుందన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చే వినతులను 15 రోజుల్లోపే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామీణ, మండల స్థాయి అధికారులు సమస్యయంతో పని చేసి సమస్య రహిత మండలాలుగా చూడాలన్నారు. గ్రామాల్లో నుంచే రెవెన్యూ సమస్యలు గ్రీవెన్స్‌కు వస్తున్నాయని, అలా కాకుండా అర్జీదారులకు మండల స్థాయి నుంచే పరిష్కారం చూపేలా చూడాలని తెలిపారు. కుటుంబ వ్యవహారాల వంటి సమస్యలను కోర్టులో పరిష్కరించుకోవాలని చెప్పారు.

జగనన్నకు చెబుదాంలో 175 వినతులు..

ఫిర్యాదుదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా అధికారులు సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించి 175 వినతులు రాగా, అందులో రెవెన్యూకు సంబంధించి 120 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ద్వామా పీడీలు తులసి,గంగాభవాని,జిల్లా రిజిస్టర్ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీ కృష్ణ,ఏపీ ఎంఐపీ పీడీ రమణారెడ్డి,జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, డీఈఓ విజయేంద్రరావు, ఆర్డీఓ సుజన, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, ఎస్సీకార్పొరేషన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి, రబ్బానీ బాషా, చిన్నారెడ్డి, నరసింహులు, జిల్లా భూగర్భజలాల అధికారి గోవర్ధన్‌రెడ్డి, డీటీసీ నిరంజన్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, డీఎస్ఓ శంకరన్, సివిల్ సప్లయిస్ డీఎం మోహన్‌బాబు, ఎల్డీఎం హరీష్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌లాల్ కుమార్తె మృతి


శ్యామ్‌లాల్, జయశ్రీ దంపతులను ఓదార్చుతున్న మంత్రి ఆర్‌కే రోజా

నింద్ర: రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జయశ్రీ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్ దంపతుల కుమార్తె రెన్సీన క్షత్ర(5) బుధవారం అనారోగ్యంతో చనిపోయింది. విషయం తెలిసి రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్‌కే రోజా నింద్రకు వెళ్లి చిన్నారి రెన్సీన క్షత్ర మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం తీవ్ర దుఃఖంలో ఉన్న శ్యామ్‌లాల్, జయశ్రీ దంపతులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. మంత్రి వెంట ఆమె సోదరుడు రాంప్రసాద్ రెడ్డి, ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీలు శుభ, దుర్గాదేవి, ఎంపీటీసీ విజేష్, సర్పంచ్‌లు వసంతమ్మ, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, మండల కన్వీనర్ వేణురాజు, కోఆప్షన్ సభ్యులు అనిల్, ఇతర నాయకులు కార్యకర్తలు కూడా ఉన్నారు.

వడ్డెర సంక్షేమ సంఘ కార్యాలయం ప్రారంభం


పెనుమూరులో వడ్డెర సంక్షేమ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న వరప్రసాద్

పెనుమూరు(కార్వేటినగరం) : రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయాలను ఏర్పాటు చేయాలని పులివెందుల మున్సిపల్ చైర్మన్, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లెపు వరప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన పెనుమూరులో వడ్డెర సంక్షేమ సంఘం మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లాల వారీగా మండలాల్లో వడ్డెర సంక్షేమ సంఘం భవనాలు ఏర్పాటు చేయడానికి కలసి కట్టుగా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామస్థాయి నుంచి కమిటీలు వేస్తామని, వీటి ద్వారా ఎక్కడ సమస్య వచ్చినా క్షణాల్లో అంతా కలసి ధైర్యంగా ఎదుర్కోవచ్చన్నారు. అనంతరం పలువురు సంఘనాయకులు మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా పెనుమూరు మండలంలో వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బోయకొండ దేవస్థానం చైర్మన్ శంకర్‌నారాయణ, వడ్డెర సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ మణి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కుమారి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెనుమూరు మండల అధ్యక్షుడిగా పురుషోత్తం


పురుషోత్తం

వడ్డెర సంక్షేమ సంఘం పెనుమూరు మండల అధ్యక్షుడిగా విడిదిపల్లికి చెందిన పురుషోత్తంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ మణి బుధవారం ప్రకటించారు. అనంతరం పురుషోత్తం మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడి బాధ్యత అప్పగించినందుకు రుణపడి ఉంటానని, అలాగే వడ్డెర కుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

హరీష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత


హరీష్ తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న అధికారులు, నేతలు

వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు గ్రామ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇటీవల ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎ.హరీష్ కుటుంబానికి విద్యుత్ శాఖ అధికారులు బాసటగా నిలిచారు. బుధవారం హరీష్ కర్మక్రియలు జరగడంతో ఆ శాఖ అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లి హరీష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈ చిన్నరెడ్డెప్ప, కార్వేటినగరం ఏడీఈ నాగరాజు, వెదురుకుప్పం ఏఈ రామాంజనేయులు బాధిత కుటుంబానికి రూ.2.36 లక్షల ఆర్థికసాయం అందించి బాసటగా నిలిచారు. అనంతరం హరీష్ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున రావాల్సిన ఎక్స్‌గ్రేషియాను చెల్లించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, నాయకులు దామోదరరెడ్డి, ఎర్రయ్య, రోశిరెడ్డి, యుగంధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయండి


జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం : మండల పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిన బాధ్యత సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. బుధవారం ఆమె ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో కలిసి పాలసముద్రం, శ్రీబొమ్మరాజుపురం గ్రామాల్లోని జగనన్న లేఅవుట్‌లను పరిశీలించారు. అక్కడ గృహనిర్మాణ పనులను తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణాలకు ఉచితంగా ఇసుక, తక్కువ ధరకే సిమెంట్, సకాలంలో బిల్లులు ఇస్తోందన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా జగనన్న లేఅవుట్‌లో తాగునీరు, రోడ్డు, విద్యుత్ సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రమేష్, హౌసింగ్ ఏఈ దాము, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అక్షయ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల సభ్యుల నిరసన


సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

పాలసముద్రం : మండలంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారులు లింకేజీ రుణాలు ఇవ్వడం లేదని డ్వాక్రా మహిళలు బుధవారం బ్యాంకు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయాలని గత నెల రోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. మండలంలోని 98 గ్రూపుల్లోని సభ్యులు కూడా గతంలో తీసుకున్న రుణాలను కంతుల ప్రకారం కట్టారని తెలిపారు. మళ్లీ రుణాల కోసం తాము బ్యాంకు వద్దకు వెళ్తే స్పందన లేదన్నారు. సోమ, మంగళవారాల్లో ఇన్‌చార్జ్ ఫీల్డ్ ఆఫీసర్ బ్యాంకుకు వచ్చి 25 గ్రూపులకు మాత్రమే రుణాలు ఇచ్చాడన్నారు. మిగిలిన గ్రూపుల్లోని సభ్యులు వెళ్తుంటే తన వల్ల కాదని చెబుతున్నాడని వాపోయారు. ప్రభుత్వం డ్వాక్రా సంఘ సభ్యులకు రూ.1.50 లక్షల రుణం ఇచ్చి ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తుంటే, బ్యాంకు సిబ్బంది మాత్రం స్పందించడం లేదని తెలిపారు. ఇప్పటికైనా బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి తమకు రుణాలు మంజూరు చేయాలని కోరారు.

08జీడీఎన్66 సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యాల సాధన



జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ స్వరూపను సన్మానిస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కార్వేటినగరం: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ స్వరూప అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ స్వరూప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. అనంతరం డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ విజయులురెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధన కోసం అన్ని వనరులను వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐవైఎఫ్ శ్రేణులు

నగరి : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని ఏఐవైఎఫ్ నగరి నియోజకవర్గ కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం వామపక్షాల సమ్మెలో భాగంగా ఆర్డీఓ కార్యాలయం ముందు వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పట్లో ఆంధ్రాకు సంబంధించిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, 32 మంది బలిదానాలతో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఉక్కు పరిశ్రమను సాధించుకున్నామని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు లాభాల్లో నడుస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండిగా ప్రైవేటీకరణ చేయాలనుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, నాయకులు బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు


కుర్చీలపై కూర్చుని పాఠాలు వింటున్న చిన్నారులు

పెనుమూరు(కార్వేటినగరం): కార్పొరేట్ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి చేస్తోందని ఐసీడీఎస్ పర్యవేక్షకులు భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మండలంలోని అంగన్‌వాడీకేంద్రాలకు ప్రభుత్వం మంజూరు చేసిన 220 కుర్చీలు, 55 టేబుళ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. అదేవిధంగా జగనన్న గోరుముద్ద పథకం ద్వారా చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తోందని తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారాన్ని ఇంటి వద్దకే అందిస్తోందని చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బంది పలువురు ఉన్నారు.

విజ్ఞాన భాండాగారాలు..తాళపత్ర గ్రంథాలు


తాళపత్ర గ్రంథాల డిజిటలైజేషన్‌పై సమీక్షిస్తున్న టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్: పూర్వీకులు మనకు అందించిన విజ్ఞాన భాండాగారాలైన తాళపత్ర గ్రంథాలను డిజిటలైజేషన్ చేసి భావితరాలకు అందించాలని టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. ఇందుకు అవసరమైన ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని అధికారులకు సూచించారు. ఆయన బుధవారం మ్యాన్ స్క్రిప్ట్ ప్రాజెక్టు ప్రగతిపై టీటీడీ పరిపాలన భవనంలో ఎస్వీయూ, ఎస్వీ వేద వర్సిటీ వీసీలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మన పూర్వీకులు సాహిత్య, శాస్త్ర సాంకేతికత వంటి అనేక అంశాలను తాళపత్ర గ్రంథాల్లో లిఖించారని తెలిపారు. ఎన్నో తాళపత్ర గ్రంథాలను ఎస్వీ ప్రాచ్య పరిశోధన సంస్థకు అందజేసినట్టు పేర్కొన్నారు. ఎస్వీయూ, ఎస్వీ వేద వర్సిటీ పరస్పర సహకారంతో మ్యాన్ స్క్రిప్ట్స్ ప్రాజెక్టు ద్వారా తాళపత్ర గ్రంథాలను డిజిటలైజ్ చేయాలన్నారు. డిజిటలైజ్ చేసిన సమాచారాన్ని టీటీడీ పుస్తక రూపంలో ముద్రించి పాఠకులకు అందిస్తుందని తెలిపారు. ఎస్వీయూ వీసీ రాజారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో టీటీడీ జేఈవో సదా భార్గవి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య రాధేశ్యాం, ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా కమాండ్ కంట్రోల్ పనులు

తిరుపతి కల్చరల్: అత్యాధునిక పరిజ్ఞానంతో తిరుపతి నగరంలో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను వేగవంతం చేయాలని తిరుపతి స్మార్ట్ సిటీ సీఈవో అండ్ ఎండీ, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను, కాంట్రాక్ట్ నిర్వాహకులను ఆదేశించారు. ఆమె బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై ఇంజినీరింగ్, ఏఈకామ్, కాంట్రాక్ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ పనుల జాప్యంపై కాంట్రాక్ట్ నిర్వహణ సంస్థ ఎన్‌ఈసీ నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేయాలన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు: కడుపు నిండా మంచి భోజనం పెడుతున్న మంత్రి రోజమ్మ మేలు మరువలేమని గర్భిణులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షల కోసం వచ్చిన తమకు పౌష్టికాహారం అందించడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని తెలిపారు. మంత్రి రోజా పదికాలాల పాటు ఇలానే ప్రజలకు మంచి చేయాలని కోరారు. అనంతరం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు వెజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటి పండు అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్లు నారాయణస్వామి, పుష్పమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పౌష్టికాహార సరఫరా గురించి బాలింతలను అడిగి తెలుసుకుంటున్న పీడీ నాగశైలజ

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయండి

కార్వేటినగరం: ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని శిశుసంక్షేమ శాఖ పీడీ నాగశైలజ అన్నారు. బుధవారం మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో పౌష్టికాహార పంపిణీపై ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అంగన్‌వాడీ పౌష్టికాహారంలో ఎక్కడా లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత పర్యవేక్షకులపై ఉందన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణుల ఇళ్ల వద్దకు వెళ్లి పౌష్టికాహారం సక్రమంగా అందుతోందా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పలు సూచనలు, సలహాలను అందించారు. వారి వెంట సీడీపీ పద్మసునంద, పర్యవేక్షకులు ఇందిరా, షామిని తదితరులు పాల్గొన్నారు.


పాలసముద్రం: గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

గర్భిణులకు వైద్య పరీక్షలు

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రతి గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుంటేనే మాతాశిశు మరణాలు జరగవని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్లరసం, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు నెలసరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలన్నారు. సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.